కథా నిలయం
శ్రీకాకుళం

# బోన్సాయ్ మనుషులు

"డైనింగ్ టేబుల్ ఒక అలంకారం అయిపోయిందండీ!" ఇంట్లో అడుగుపెట్టగానే అంది పార్వతి."

సంభ్రమంగా చూశాను.

"హాలులో సగం ఆక్రమించి అన్నిటికీ అడ్డుగా ఉంటోంది. దాన్ని కోయించి చిన్న చిన్న టేబుళ్ళుగా, టీపాయ్‌లుగా చేయిస్తే మంచిది"

నా భార్య మాటలకు ఆశ్చర్యంగా, అపనమ్మకంగా చూశాను. నా గురించి నా ఫీలింగ్సు గురించి తెలిసి కూడా ఆమె అలా మాట్లాట్టం నన్ను నిర్విణ్ణుణ్ణి చేసింది.

"ఏవిటలా చూస్తున్నారు. నిన్ననే ఏదో పేపర్లో చదివేను. ఒక సంవత్సరం పాటు ఉపయోగించని వస్తువు ఇంట్లో ఉంచుకోవడం అనవసరమట"

నేను మాట్లాడలేకపోయాను. బాధతో కుమిలిపోతూ డైనింగ్ టేబుల్ని సమీపించాను.

హాలులో ఒక పక్కగా జాలిగొలుపుతూ ఉంది. చక్కని నగిషీ పనితనంతో అలరారుతూ ఒకనాటి వైభవానికి ప్రతీకగా నిలిచి ఉంది. నిట్టూరుస్తూ ఉంది!

నేను రాజమండ్రిలో పనిచేసేటప్పుడు ముదురు టేకుతో దాన్ని ప్రత్యేకంగా చేయించాను. అంచులకూ, మధ్యలోని పద్మాలకూ రోజ్‌వుడ్ ఉపయోగించాం. దాని కాళ్ళు దేవాలయస్తంభాల మీద కనిపించే సింహపు కాళ్ళను పోలి ఉంటాయి.

మా ఇంటికొచ్చిన ప్రతివారూ డైనింగ్ టేబుల్ పనితనాన్ని మెచ్చుకుని తీరేవారంటే అతిశయోక్తి కాదు.

ఎన్ని ఆశలతో చేయించాను దాన్ని!

నాకు తెలీకుండానే నిట్టూర్చాను.

మా నాన్నగారు గ్రామ పెద్దగా ఉండేవారు. ఇంట్లో కూడా ఆయన మాటకు ఎదురుండేది కాదు. అలాగని పులిలా ఉండేవారూ కాదు.

ఉదయం పూట అంతా రకరకాల పనుల మీద వెళ్తూంటారు గనుక సాయంత్రం భోజనం మాత్రం అంతా కలిసే చెయ్యాలనేవారు. అంచేత అంతా ఠంచనుగా ఏడున్నర అయ్యేసరికి ఇంటికి చేరేవాళ్ళం.

మగవాళ్ళమంతా వరుసగా పీటలు వాల్చుకుని కూర్చుని భోంచేసేవాళ్ళం. ఇంటి విషయాలూ, ఊరి విషయాలూ నాన్నగారు చెబుతుంటే ఆసక్తిగా వింటూ తినేవాళ్ళం. మధ్య మధ్య మా అభిప్రాయాలు కనుక్కుంటూ మా గురించి, మా చదువుల గురించి తెలుసుకుంటూండేవారు.

ఒకరకంగా రాత్రి భోజన సమయం మా ఇంటి సమావేశంలా ఉండేది. అందరికీ అన్ని విషయాలూ తెలిసేవి. ఒకరి గురించి ఒకరికి తెలిసేది. అభిమానాలూ, అప్యాయతలూ పెరిగేవి. అంతా ఒకటి అన్న భావం బలంగా నాటుకొనేది.

మగవాళ్ళ భోజనాలయ్యాక ఆడవాళ్ళంతా కూర్చునేవారు. కష్టసుఖాలు కలబోసుకునేవారు. పని పాటల గురించి మాట్లాడుకునేవారు.

మొత్తానికా సమావేశాలు ఎంతో ఉపయోగకరంగా, ఉత్తేజకరంగా ఉండేవి. అరమరికలు లేకుండా అంతా కలిసి ఉండడంలో ఉన్న ఆనందం, అనుభూతి అందరికీ అనుభవంలోకొచ్చేది.

ఉద్యోగాలొచ్చాక మా అన్నదమ్ములమంతా ఊళ్ళు పట్టుకుపోయి ఆ అనుభవాన్ని కోల్పోయాం.

అయినా, నాన్నగారి మాట ప్రకారం ప్రతి ఏటా మా అన్నదమ్ములం, అక్కచెల్లెళ్ళం అంతా సకుటుంబంగా మా ఊరి అమ్మవారి జాతర కెళ్ళేవాళ్ళం. ఆ నాలుగు రోజులూ పాత జ్ఞాపకాల్ని నెమరు వేసుకుంటూ, నాన్నగారి కబుర్లు వింటూ ఆనందంగా గడిపి వస్తూండేవాళ్ళం.

అలాటి చక్కని సాంప్రదాయాన్ని నా ఇంట్లోనూ నెలకొల్పాలన్న ఆలోచనకి కార్యరూపమే ఈ డైనింగ్ టేబుల్. ఆడా, మగా కలిసి ఒకేసారి భోంచెయ్యడానికి వీలుగా పొడుగుపాటి డైనింగ్ టేబుల్ తయారు చేయించాను. ఎనిమిది కుర్చీలు కూడా చేయించాను.

మేం ఇద్దరమూ, మా ఇద్దరబ్బాయిలూ, అమ్మాయీ అంతా కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోంచేసేవాళ్ళం. ఎవరైనా బంధువులొస్తే వాళ్ళకు కూడా మాతో పాటు వడ్డించేవాళ్ళం. మా పద్ధతిని ఎంతగానో మెచ్చుకునేవారంతా.

కానీ, ఆ పద్ధతి మా అబ్బాయిల పెళ్ళిళ్ళయ్యాక కుంటి నడకలో పడింది. భోజన వేళల్లో, అలవాట్లలో వచ్చిన మార్పులు మార్పు తీసుకొచ్చాయి. అంచేత ఒక్కొక్కరం

ఒక్కోటైములో డైనింగ్ టేబుల్ మీదే భోంచేసేవాళ్ళం. ఎవరి భార్యలు వారితో జత కలిసేవారంతే.

ఉద్యోగరీత్యా మా అబ్బాయిలు సిటీ కెళ్ళిపోయారు. పెళ్ళవడంతోనే అమ్మాయి అత్తవారింటికెళ్ళిపోయింది. మేం అంతా కలిసి ఒకే చోట ఉండాలి, కలిసిమెలిసి ఉండాలి అనే ఉద్దేశంతో సిటీకి ట్రాన్స్ఫర్ చేయించుకున్నాను.

సిటీ బిజీ లైఫ్ నాకు ఇష్టంగా ఉండదు. అయినా అందరం కలిసుండాలన్న కోరిక అయిష్టాన్ని ఇష్టంగా మార్చింది.

మాకు అనుకూలంగా ఉండేట్లు ఎటాచ్డ్ బాత్‌రూమ్స్ గల త్రీ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంటును కొని అందులోకి చేరిపోయాం. మళ్ళీ అంతా కలిసి ఇది వరకట్లా డైనింగ్ టేబుల్ మీద భోంచెయ్యొచ్చని ఎంతగానో ఆశపడ్డాను.

కానీ, ఒక్కొక్కళ్ళు ఒక్కోరకమైన ఇబ్బందులు చెప్పడంతో, నిస్సహాయత వెలిబుచ్చడంతో దానినో పక్కన ఉంచెయ్యక తప్పింది కాదు. చిత్రమేమిటంటే, ఒకే ఇంట్లో ఉంటున్నా కలిసి భోంచేసే అవకాశాలే కాదు, కలిసి కూర్చుని కబుర్లు చెప్పుకునే అవకాశాలూ మృగ్యమైపోయాయి. 'హాయ్' కే పరిమితమైపోయింది మా సంభాషణ!

"ఏవిటలా అయిపోయారు? నా మాటలకా?" పార్వతి అంది.

"అగ్గిపెట్టెలాంటి చిన్న అపార్ట్‌మెంట్లో ఉండి కూడా ఒకరికొకరం ఎంతో దూరమైపోతున్నట్లుగా ఉంది పార్వతీ. మనుషుల మధ్య దూరం పెరుగుతోందో, మనసులు ఇరుకైపోతున్నాయో అర్థం కావట్లేదు."

"అదేవిటలా అంటున్నారు?"

"కనీసం కలిసి భోంచెయ్యలేకపోతున్నామంటే ఏమనుకోవాలి చెప్పు?"

"మీదంతా చాదస్తం లెద్దురూ. ఎప్పుడో పూర్వకాలంలో జరిగాయని ఇప్పుడూ అలాగే జరగాలంటే ఎలా కుదురుద్ది. మన చిన్నప్పుడు పెళ్ళి భోజనాలంటే ఎంత గొప్పగా ఉండేవి. బంతులుగా కూర్చోబెట్టి ఆకుల్లో అన్ని రకాలూ వడ్డించేవారు. మళ్ళీ మళ్ళీ కొసరి కొసరి వడ్డన చేసేవారు. అంతా ఒక్కసారే లేచేవారు. ఇప్పుడేముంది, బఫేలంటున్నారు. ముష్టెత్తుతున్నట్టు ప్లేట్లు చేత్తో పట్టుకుని నాలుగు మెతుకులు కతికి హడావిడిగా వెళ్ళిపోవడమే."

"కాలంతో బాటు ఈ మార్పులన్నీ సహజమంటావు"

"అంతే మరి. మండువా లోగిళ్ళు పోయి విడి విడి ఇళ్ళు వచ్చాయి. ఇప్పుడవి పోయి అపార్ట్‌మెంట్లొచ్చాయి. ఇక రేపేం వస్తాయో?!"

"గదులొస్తాయి"

"వస్తే రానివ్వండి మరి. వచ్చేవి మనం మోకాలొడ్డినంత మాత్రాన ఆగవు కదా. గీజర్ ఆన్ చేశాను. నీళ్ళు వేడెక్కి ఉంటాయి. వెళ్ళి స్నానం చేసి రండి"

స్నానం చేసొచ్చి, హాల్లోని సోఫాలో కూర్చున్నాను.

టీవీలో వార్తలొస్తున్నాయి.

"వంట చేసొస్తాను" సంజాయిషీ ఇస్తున్నట్టంది పార్వతి.

"కోడళ్ళు వచ్చాకైతే కాస్త చేదోడొస్తారు కదా"

"అవతల ఆఫీసు పని. ఇవతల పిల్లల పని. వాళ్ళు మాత్రం ఎన్నని చేస్తారు పాపం!"

"సరేలే అందరికీ వండి పెట్టడమే నీకు తృప్తి"

నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. పెద్దబ్బాయీ కోడలూ వచ్చారు. ఇద్దరూ ఉద్యోగస్థులే.

"హాయ్ డాడ్!"

"ఎలా ఉందిరా ఉద్యోగం?"

"ఫైన్.."

వాళ్ళు తమ గదిలోకెళ్ళిపోయారు. తలుపు మూసుకోవడంతో వారి ప్రపంచం వేరైపోయింది. గుండెల్లో ఏదో తెలీని బాధ సుళ్ళు తిరిగింది.

ఆ గదే వాళ్ళ ఇల్లు. అక్కడే పడుకుంటారు. ఎటాచ్డ్ బాత్రూమ్‌లో స్నానాలు చేస్తారు. బట్టలు ఉతుక్కుంటారు. గదిలోనే టీవీ చూస్తూ భోంచేస్తారు. మంచం మీద పడుకుని చదువుకుంటారు. పిల్లల చేత హోమ్ వర్కు చేయిస్తారు. అన్నీ అందులోనే. మా ఆవిడ వండిన అన్నం, కూరలు పట్టుకెళ్ళడానికి మాత్రమే తలుపు తీస్తారు.

చిన్న కోడలొచ్చింది. కొనుక్కొచ్చిన ఆకుకూరలు అత్తగారికిచ్చి తన గదిలోకెళ్ళిపోయింది. ఆ తలుపూ మూసుకుపోయింది. బహుశా సౌండ్ సిస్టంలో సంగీతం వింటూనో, టీవీలో ఇష్టమైన ఛానల్ చూస్తూనో ఉండి ఉంటుంది. బ్యూటీ పార్లర్ తెరవాలని ఆమె ప్రయత్నం. అందుకని బ్యూటీషియన్ కోర్సు చేస్తోంది. సంబంధిత పుస్తకాలు చదువుతూ ఆ తరహా కార్యక్రమాలు చూస్తూంటుందెక్కువగా.

ఇంట్లో ఇద్దరు కోడళ్ళున్నా మా ఆవిడ కందించే సాయం ఓ పెద్ద సున్నా. అసలావిణ్ణి పట్టించుకునేదే తక్కువ. మధ్యలో కాఫీలో, టీలో కావాల్సొస్తే కిచెన్లో కెళ్ళి తమవరకూ చేసుకుని పట్టుకెళ్ళిపోతారంతే.

ఆ మధ్య పార్వతి ఒళ్ళు తెలియని జ్వరంతో పడి ఉంది. కోడళ్ళిద్దరూ ఇంట్లోనే ఉన్నారు. కానీ, ఆ సంగతి రాత్రి భోజన సమయంలో వంట చెయ్యలేదని తెలిసినప్పుడే వాళ్ళు గ్రహించారు.

మనుమలొచ్చారు. పెద్దబ్బాయి పిల్లలు వాళ్ళు. వస్తూనే పుస్తకాల బ్యాగ్స్ పక్కన పడేసి ఛానల్ మార్చి కార్టూన్ సీరియల్ పెట్టేశారు.

"కాసేపు వార్తలు చూడనీండిరా!"

వాళ్ళు వినిపించుకోలేదు. టీవీలో నిమగ్నమైపోయారు.

"మీకు వడ్డించనా?"

"డైనింగ్ టేబుల్ మీద తింటాను"

బుగ్గలు నొక్కుకుని చూసింది.

నేనూ దాని మీద తినడం లేదీమధ్య. లంచ్ కేరియర్ తీసుకెళ్ళి ఆఫీసులో తింటాను. డిన్నర్ రెండు రొట్టెలూ, మజ్జిగానూ. అందుకని టీవీ చూస్తూనో, పార్వతితో కబుర్లు చెబుతూనో కానిస్తూంటాను.

మళ్ళీ ఏమనుకుందో, "రండి వడ్డిస్తాను" అంది.

వెళ్ళి కూర్చున్నాను.

పెద్ద బల్లమీద ఒంటరిగా కూర్చుని భోంచేయాలంటే ఎంతో వెలితిగా అనిపించింది.

"నువ్వు కూడా రారాదూ కలిసి తిందాం."

"ఇంకా పిల్లలు తినలేదు. నా తిండికి తొందరేం లేదు గానీ, మీరు తినేసెయ్యండి. రొట్టెలు చల్లబడితే మీకు సయించదు..."

మౌనంగా తింటోంటే చిన్నబ్బాయి వచ్చాడు. వాణ్ణి పలకరిద్దామని తిరిగేలోపలే వాడు తన గదిలో కెళ్ళిపోయాడు. తలుపు మూసుకుంది. వాడి గదిలోని టీవీకి ప్రాణం పోశాడు కాబోలు చిన్నగా క్రికెట్ కామెంటరీ వినిపిస్తోంది.

భోంచేసి వచ్చేసరికి పెద్ద కోడలు పిల్లల్ని గదిలోకి తీసుకెళ్ళింది. మరి కాసేపటికొచ్చి అన్నం, కూరలు ఉన్న హాట్ పేక్స్ తీసుకొని తమ గదిలోకి వెళ్ళిపోయింది.

"శోభా! తొమ్మిదయిందే. అబ్బాయికి భోజనం పెట్టవూ"

"మీ అబ్బాయి బయట తినేసి వచ్చార్ట. నేను తరువాత తింటాన్లే అత్తయ్యా. మీరు తినేసెయ్యండి"

పార్వతి మెనుదిరిగింది. నిట్టూర్చి ఉంటుందని నా అనుమానం.

టీవీ కట్టేసి మా గదిలోకెళ్ళాను. ఆవిడ భోంచేసి అన్నీ సర్ది వచ్చింది.

"దేని గురించి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు?"

"అబ్బాయిల్తో కలసి కబుర్లు చెప్పి ఎన్నాళ్ళయిందా అని ఆలోచిస్తున్నాను"

"మీది మరీ చిత్రం. వాళ్ళూ మనంత అయ్యారు. వాళ్ళ గొడవలు వాళ్ళకుంటాయి. వాళ్ళ ఇష్టాలు వాళ్ళకుంటాయి. ఇంకా మనం గీచిన గీతమీదే నడవాలంటే ఎలాగా?"

"అలాగని అంతా ఒకచోట కూర్చుని మంచీ చెడూ కూడా మాట్లాడుకోలేమా? ఇంటి ఖర్చంతా నేను భరిస్తున్నాను. వంట పనంతా నువ్వు చేస్తున్నావు. మన కష్టసుఖాలేవిటో వాళ్ళు తెలుసుకోవద్దూ. వాళ్ళ సంపాదనని ఏంచేస్తున్నారో మనం తెలుసుకోవద్దూ. వాళ్ళకు సరైన గైడెన్స్ మనం ఇవ్వొద్దూ"

"వాళ్ళడగినప్పుడు సలహా ఇవ్వొచ్చులెద్దురూ"

"అంటే ఏవిటి నీ అర్థం. వాళ్ళను వాళ్ళ మానాన వదిలేసి మనం నిశ్చింతగా ఉందామంటావా? వాళ్ళు సవ్యంగా, చక్కగా భవిష్యత్తు కోసం ప్లాన్ చేసుకునేలా చెయ్యాల్సిన బాధ్యత మన మీద లేదా?"

"మన కంఠశోష తప్ప మనం చెప్పినట్టు వింటారా ఈ కాలపు పిల్లలు?! వాళ్ళకు తోచినట్టు, వాళ్ళ పెళ్ళాలు చెప్పినట్టు చేసుకుపోతారంతే. వాళ్ళ విషయాల్లో తల దూర్చకుండా ఉంటేనే మన మర్యాద మనకు దక్కుతుంది"

దెబ్బతిన్నట్టు చూశాను. బాధగా చూశాను.

తనూ లోలోన నాలాగే బాధపడుతోందా? ఏదో సర్ది చెప్పుకుని రాజీ పడిపోయిందా?

"సరే ఇంటి విషయాలు వదిలేసెయ్యి. కనీసం వారానికి ఒక్కరోజైనా, ఒక్క పూటైనా అంతా కలిసి భోంచెయ్యలేకపోతే ఇక మనం ఒకే కప్పు కింద ఉండి ఏం ప్రయోజనం చెప్పు?"

వెర్రిగా చూసింది.

"ఏవిటి మీ ఉద్దేశం. పిల్లల్ని వేరు పెట్టేస్తానంటారా ఏవిటి ఖర్మ?!"

ఆమె ముఖంలో ఆందోళన తొంగి చూసింది.

"ఇప్పుడు వేరుగా లేమంటావా?"

"చాల్లెద్దురూ. వయసు పెరుగుతున్న కొద్దీ మీకు చాదస్తం పెరిగిపోతోంది. పిల్లలు వేరెళ్ళిపోతే మనిద్దరం బిక్కు బిక్కు మంటూ ఉండాలి."

"ఇప్పుడలా లేమంటావా? నీకు నేనూ, నాకు నువ్వూ తప్ప వాళ్ళకు మనమూ, మనకు వాళ్ళూ అన్నట్టు ఉంటున్నామా చెప్పు? మొన్నోసారి నీకు జ్వరం వచ్చినప్పుడేమైందో గుర్తుందిగా? అవాళ జ్వరం అయింది. రేపు మరొకటి కావొచ్చు. ఏమొచ్చినా అంతేకదా? అంతా ఉన్నా ఒంటరి బతుకే కదా?!"

నా స్వరం వణికింది.

"ఎక్కువగా ఆలోచించొద్దు. ఎలా జరగాలని రాసుంటే అలా జరుగుతుంది. పడుకోండి. నాకు నిద్దరొస్తోంది."

ఒక్కోసారి కర్మ సిద్ధాంతం మనిషికెంత ఓదార్పునిస్తుంది!

పనిచేసి అలసినందునో ఏమో వెంటనే నిద్రలోకి జారుకుంది పార్వతి.

నిద్రాదేవి మాత్రం నా దరి చేరడానికి సాహసించలేకపోయింది.

రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాను.

ఇక నుంచి ప్రతి ఆదివారం లంచ్ అంతా కలిసి డైనింగ్ టేబుల్ మీద చేయాలి. ఆ రకంగా అంతా అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చు. కమ్యూనికేషన్ గేప్ తగ్గించుకోవచ్చు. అభిమానాల్ని గుణించుకోవచ్చు అనుకున్నాను.

పార్వతితో చెప్పి, "దీని వల్ల మనమంతా ఒకరికొకరం మరింత దగ్గరవుతాం. సమిష్టి భావన పెరుగుతుంది కూడానూ" అన్నాను.

"అబ్బాయిలకు చెప్పి చూడండి ఏవంటారో!"

పెద్దవాడు సరే అన్నాడు. చిన్నవాడేమో, "లంచ్ వద్దు డాడ్. డిన్నర్ చేద్దాం" అన్నాడు. ఆఖరికదే ఖాయం చేసి కోడళ్ళకు కూడా చెప్పమన్నాను.

ఎదురు చూసిన ఆదివారం రానే వచ్చింది.

నేనే బజారుకెళ్ళి మాంసం, చేపలూ కొనుక్కొచ్చాను.

కాకినాడ కాజాలో కిలో తీసుకున్నాను.

పార్వతి వెనకెనకే తిరిగి కొత్త రకంగా కూరలు వండించాను.

అరటి పళ్ళు వీధిలోకొస్తే తాను కొన్నది.

పిల్లల అభిరుచులకనుగుణంగా డిన్నర్ రెడీ చెయ్యడానికి చాలా శ్రద్ధ తీసుకున్నాం ఇద్దరమూ కూడా.

"ఇవాళ మీకేదో పండుగలా ఉంది"

అవునంటూ తలాడించాను. ఎంచేతో నోట్లోంచి మాటలు ఊడి పళ్ళేదు.

నాలో ఏదో తెలీని ఉద్విగ్నత!

రాత్రి ఎనిమిదయింది.

డైనింగ్ టేబుల్ని మధ్యకు లాగాం. శుభ్రంగా తడి గుడ్డతో తుడిచాం.

అన్ని రకాల డిష్‌లూ వరుసగా అమర్చాం. ప్లేట్లూ, స్పూన్లూ, గ్లాసులూ అన్నీ అందంగా పెట్టాం.

మనవలొచ్చి చూసి ముచ్చట పడిపోయారు.

వాళ్ళెన్ని అనుభూతులు మిస్సవుతున్నారో అనిపించేసరికి గుండె కలుక్కుమంది.

గత సంస్కృతీ సంప్రదాయాల గురించి వారికైనా తెలీకపోతే రేపు కొంగ్రొత్త సంస్కృతినెలా చక్కగా నిర్మించుకోగలరనిపించింది.

"ఇవాళ మీ బర్త్‌డేయా గ్రాడ్‌ఫా" అన్నాడో గడుగ్గాయి.

"అవున్రా. మీరూ మీ డాడీ నాకేం గిఫ్టు ఇస్తారో చూస్తానుగా"

ఆఫీసులోని పై అధికారిని కలిసొస్తామని వెళ్ళారు పెద్ద కొడుకూ, కోడలూనూ.

టైముకు వచ్చేస్తామని చెప్పివెళ్ళేరు.

వాళ్ళ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాం.

ఎనిమిదిన్నరైంది. రాలేదు.

"చిన్నబ్బాయిని, కోడల్ని పిలుస్తాను. మీరంతా తినేయండి. పెద్దవాడితో కలిసి నేను తింటాను" అంది.

"ఎలాగైనా సరే ఇవాళ అంతా కలిసి తినాల్సిందే. ఇంకాస్సేపు చూద్దాం"

చిన్న కోడలు బయటికొచ్చి పరిస్థితి చూసి లోపలికెళ్ళిపోయింది.

ఆవిడ ముఖం అప్రసన్నంగా ఉంది. పెద్దబ్బాయీ వాళ్ళకు అధిక విలువ ఇస్తున్నామని ఇదవడం లేదుకదా అనిపించిందొక్క క్షణం.

చిన్నబ్బాయి చొక్కా తొడుక్కుని గబగబా వెళ్తోంటే, "ఇప్పుడెక్కడికిరా?" అడిగాను.

"ఈ సెంటర్లోకే. రెండు నిమిషాల్లో వచ్చేస్తాను"

అయిదు నిమిషాలకు తిరిగొచ్చాడు వాడు. చేతిలోని ప్లాస్టిక్ సంచిలో ఏవో పొట్లాలున్నాయి. బిర్యానీ వాసన ముక్కు పుటాల్ని తాకింది.

పార్వతి నా వంక చూసింది. ఆవిడ ముఖంలో రక్తపుచుక్కలేదు.

"వాళ్ళకు కోపం వచ్చినట్టుంది" అనెళ్ళి, "శోభా! భోంచేద్దాం రండి. మీ మావయ్య గారు మీకోసం ఎదురు చూస్తున్నారు" అని పిలిచిందామె.

"నేను నోట్సు తయారు చేసుకుంటున్నానత్తయ్యా. మీ అబ్బాయికేమో ఆకలిగాలేదుట. తరువాత లైట్‌గా తింటానంటున్నారు" తలుపు కొంచెంగా తీసి జవాబిచ్చి తలుపేసుకుందామె.

నిరాశగా వచ్చింది. "ఇదంతా మీ వల్లే" అంటూ నా వంక నొచ్చుకుంటూ చూసింది.

పెద్దబ్బాయీ, కోడలూ వచ్చారు.

"మీ కోసమే చూస్తున్నాంరా. త్వరగా కాళ్ళూ చేతులూ కడుక్కుని రండి భోంచేద్దాం."

"మీరింకా భోంచేయలేదా? ఎనిమిదింటికి కలిసి భోంచేద్దామన్నారుగా చేసేసి ఉంటారనుకున్నాం"

"అంతా కలిసి తిందామనుకున్నాక ఎలా తింటాంరా?"

"సారీ డాడ్. ఫ్రెండ్స్ బలవంతం చేస్తేనూ, ఎలాగూ ఆలస్యం అయింది కదాని హోటల్లో తినేశాం"

నా జవాబు కోసం ఎదురు చూడకుండానే తమ గదిలోకెళ్ళిపోయారు.

"రా పార్వతీ! మనమూ, పిల్లలూ తిందాం. పాపం పిల్లలకు ఆలస్యమైపోయింది"

మేం కూర్చున్నాం. మనుమలూ వచ్చారు. ఇంతలో ఒకడు టీవీలో కార్టూన్ ఫిల్మ్ వస్తోందని అరిచాడు. గబుక్కున ఇద్దరూ లేచి కంచాలు తీసుకుని టీవీ దగ్గరకెళ్ళిపోయారు.

నేనూ, ఆవిడా, పెద్ద టేబులూ మిగిలాం.

ఆకలి చచ్చిపోయింది. ఏదో తిన్నామనిపించి లేచాం.

పడుకోబోతూ అన్నాను. "విశాలమైన మనసున్న మనుషులకుగాని కుంచించుకు పోయిన మనసుల మరుగుజ్జులకు ఈ డైనింగ్ టేబుల్ అనవసరం పార్వతీ. డైనింగ్ టేబుల్ సంస్కృతికి కాలం చెల్లిపోయింది. మన టేబుల్ ఏ పురాతన వస్తు ప్రదర్శనశాలకో ఇచ్చేద్దాం"

(ఇండియా టుడే)

**15.2.2000**